# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- నూతన బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా సమర్పించాలి
- కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి
- 'సాక్షి'తో కోదాడ, హుజూర్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి



కోదాడ : నామినేషన్ల స్వీకరణకు సిద్ధమైన ఆర్డీఓ కార్యాలయం



హుజూర్‌నగర్‌లో నామినేషన్ ఫారాలు స్వీకరించే ఆర్వో కార్యాలయం

కోదాడ : అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు సంబంధించి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కోదాడ, హుజూర్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు 'సాక్షి'తో మాట్లాడారు. శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

**కోదాడ నియోజకవర్గంలో..**



రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ

కోదాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నామని, దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నామినేషన్ దాఖలు చేసేవారు తమ వాహనాలను 100 మీటర్ల దూరంలో ఉంచి, కావాల్సిన పత్రాలతో స్వేచ్ఛగా వచ్చి తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసేవారితో పాటు నలుగురిని లోపలికి అనుమతిస్తామని చెప్పారు.

**సమస్యాత్మక కేంద్రాల్లో పోలీస్ బందోబస్తు**

నియోజకవర్గంలోని 190 భవనాల్లో 296 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ర్యాంప్, ఫర్నిచర్, బాత్‌రూంలు, కరెంట్ సౌకర్యంతో పాటు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 85 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని, అక్కడ ప్రశాంతగా ఎన్నికలు జరపడానికి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 4945 మంది వికలాంగులు, 3478 మంది వృద్ధులు ఉన్నారు. వీరు పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్‌లు ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి సాక్షితో తెలిపారు.

**హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..**



రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో (తహసీల్దార్ కార్యాలయం) శుక్రవారం నుంచి ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు అన్ని ప్రభుత్వ పని దినాల్లో నామినేషన్లను స్వీకరిస్తామని హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన హుజూర్‌నగర్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు నలుగురిని కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చేవారు మూడు వాహనాలను మాత్రమే ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఉంచి నడిచి వచ్చి సంబంధిత ధ్రువపత్రాలతో నామినేషన్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. పోటీ చేయబోయే అభ్యర్థి నామినేషన్ వేసే ముందు నూతన బ్యాంక్ అకౌంట్ తెరిచి ఖాతా వివరాలను నామినేషన్ పత్రాలతో పాటు అందజేయాలని అన్నారు. అభ్యర్థి ఎన్నికల ప్రచారం కోసం చేయబోయే ఖర్చు లావాదేవీలను అకౌంట్ నుంచి నిర్వహించాలన్నారు.

**పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు**

అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు దైవసాక్షిగా లేదా మనస్సాక్షిగా శపథం (ప్రతిజ్ఞ) చేయాలని తెలిపారు. నియోజకవర్గంలోని 176 కేంద్రాల భవనాల్లో 308 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్ బూత్‌లోకి ఓటర్లు సౌకర్యంగా నడిచి వెళ్లేందుకు ర్యాంప్, ఫర్నిచర్, మూత్రశాలలు, విద్యుత్ తదితర సౌకర్యంతో పాటు కావాల్సిన తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేశామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వికలాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా వీల్‌చైర్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకర్గంలో గుర్తించిన 91 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలల్లో ప్రశాంతగా ఎన్నికలు జరిగేందుకు వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్, వెబ్ కాస్టింగ్‌తో పాటు అదనపు పోలీసు భద్రత ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**ఎన్నికల వ్యయం రూ.40లక్షలకు మించకూడదు**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వ్యయం రూ.40 లక్షలకు మించకూడదని హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వ్యయం రూ.40 లక్షలు మించితే వారిపై ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఆయన వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నాగార్జునరెడ్డి ఉన్నారు.

## అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాల అమలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతి



చిలుకూరు : పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ సుజాతాశ్రీనివాస్‌రెడ్డి

చిలుకూరు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ స్కీమ్‌లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని జెర్రిపోతులగూడెంలో సర్పంచ్ నలబోలు సుజాత, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నలబోలు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, బేతవోలు పీఏసీఎస్ డైరెక్టర్ అనంతుల ప్రమీళ శ్రీనుల ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రి సుధారాణిపుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు**

కోదాడ : కోదాడలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని 12వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు చందా నిర్మల గురువారం పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మహబూబ్‌జానీ, ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**22వ, 13వ వార్డుల నుంచి..**

పట్టణ పరిధిలోని 22వ వార్డు నుంచి వివిధ పార్టీలకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 13వ వార్డులో కౌన్సిలర్ లంకెల రమాదేవి, నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వారు పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చందర్‌రావు, ముత్తవరపు పాండురంగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాల తనిఖీ

మోతె : మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరడువాయిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గురువారం జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు కాంటాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాంటాలకు స్టాంపింగ్ మార్కు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంటాలపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కాంటాల్లో అవకతవకలు జరిగితే ఫిర్యాదు చేయాలన్నారు. సర్వారం పీఏసీఎస్ సీఈఓ దోసపాటి ఉపేందర్, చంటి, హేమేందర్, రైతులు పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతి గురువారం తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ఆమె చెప్పారు.

## 'దళితులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'

మునగాల : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ఉల్లంఘిస్తూ దళితులను మోసం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు విమర్శించారు. దళితుల సమస్యలపై డిసెంబర్ 4న నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం పకడ్బందీగా అమలు జరపాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మోసపు హామీలు ఇచ్చి దళితులను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాంపంగు జానయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, బచ్చలకూరి స్వరాజ్యం, ఆరె.రామకృష్ణారెడ్డి, వెంకన్న, పుల్లయ్య, పిచ్చమ్మ, రిటైర్డ్ ఉపాధ్యాయులు రవి, సంజీవరావు, అప్పారావు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగం అందరి నైతిక బాధ్యత



పెదవీడులో అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సూపర్‌వైజర్ ఉపేందర్

మఠంపల్లి : ఓటు హక్కు వినియోగం అందరి నైతిక బాధ్యత అని తహసీల్దార్ మంగ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలతో కలిసి ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. పెదవీడులో అవగాహన కార్యక్రమంలో ఎన్నికల సూపర్‌వైజర్ ఉపేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, బీఎల్‌ఓలు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

నడిగూడెం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పందిటి క్రాంతికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలంఅయిందని ఆరోపించారు. పోటీ పరీక్షల పేపర్లు లీకేజీ చేస్తూ యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. దళితబంధు, బీసీ బంధు పథకాల అమలులో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కోదాడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా తాను నిలబడనున్నట్లు పేర్కొన్నారు.

## ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు. పద్మావతిరెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల పార్టీ నాయకులు విలాసకవి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి



కోదాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ కుమార్తె కావ్య

కోదాడ : సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని, ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి మల్లయ్యయాదవ్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం కోదాడలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సతీమణి ఇందిర, కుమార్తె కావ్య, కోడలుతో పాటు కౌన్సిలర్లు కమదం చందర్‌రావు, కల్లూరి పద్మజ, నాయకులు సత్యబాబు, కట్టెబోయిన శ్రీనివాస్, ఖాజామోయినొద్దీన్, గట్ల కోటేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రమ్యారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురానికి చెందిన అన్నెం సత్యనారాయణరెడ్డి– హైమావతిల కుమార్తె సాఫ్ట్‌వేర్ రమ్యారెడ్డికి గత ఏడాది కార్పొరేట్ హాస్పిటల్స్‌లో డాక్టర్లు నిర్లక్ష్యంతో సరైన వైద్యం చేయకపోవడంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ గురువారం గ్రామంలో ఆమె వర్ధంతి సందర్భంగా సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలు పార్టీలు, సంఘాల నాయకులు దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. తన కుమార్తె మృతికి కారణమైన రెండు వైద్యశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏడాదిగా రమ్యారెడ్డి తండ్రి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఆరోగ్యం బాగోలేక వైద్యశాలలకు వెళ్తే వారిని జలగళ్ల పీల్చుతున్న కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, రమ్యారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కొల్లు వెంకటేశ్వరరావు, రామారావు, సుమన్‌రెడ్డి, శిరీషాకొండారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## ఉత్తమ్‌తోనే హుజూర్‌నగర్ అభివృద్ధి సాధ్యం

గరిడేపల్లి : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనే అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కాచవారిగూడెం, కట్టవారిగూడెం, రేగులగడ్డ తండా, కుతుబ్‌షాపురం, చినగారకుంటతండా, ఎల్బీనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి, గుండు రామాంజీగౌడ్, టీపీసీసీ సభ్యుడు పైడిమర్రి రంగనాథ్, కటకం రమేష్, చక్రధర్‌రావు, సేవాదల్ నాయకురాలు శకుంతలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పోలింగ్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంసీసీ బృందం

మఠంపల్లి : మండలంలోని హనుమంతులగూడెం, యాతవాకిళ్ల, కామంచికుంటతండా, భీల్యానాయక్ తండాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలు బృందం ఇన్‌చార్జ్, ఎంపీడీఓ జానకిరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ నాటికి అన్ని కేంద్రాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సైదులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## పథకాలే బీఆర్‌ఎస్ గెలుపునకు సోపానాలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : మంగళితండాలో ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

కోదాడరూరల్ : సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నర ఏళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు సోపానాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని నల్లబండగూడెం, మంగళితండా, చిమిర్యాల, దోరకుంట, అల్వాలపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బులు సంపాదించాలనే ఆశ తనకు లేదని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితబంధు, గృహలక్ష్మి పథకాలను అర్హులైన వారందరికీ వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు సుశీలబెంజిమెన్, శోభారాణి, ఎంపీటీసీ క్రాంతికుమార్, సౌజన్యబాలకృష్ణ, ధరవత్ బాబ్జీ, శ్రీకాంత్ ఉన్నారు.

**ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు**

కోదాడఅర్బన్ : పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం పంచమ తిథి సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మల్లయ్యయాదవ్– ఇందిర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకం చేశారు. సింధూర పూజ, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం పురోహితులు నాగయ్యశాస్త్రి, ప్రవీణాచార్యులు వేద ఆశీర్వాదం చేశారు.

**ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు**

నడిగూడెం : మండలంలోని బృందావనపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్ నాయకత్వమే ప్రజలకు శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ జక్కుల వీరయ్య తన అనుచరులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా మేళ్లచెరువు, పాలకవీడుకు చెందిన శేషిరెడ్డి, పద్మ, గోపిరెడ్డి, కోటమ్మ హుజూర్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు గుండా బ్రహ్మారెడ్డి, జనిగ సైదులు, కడియం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి**

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆకాంక్షించారు. చింతలపాలెం మండలం దొండపాడులో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం సహస్ర నామ గణపతి పూజ, హోమం, తదితర పూజల్లో సైదిరెడ్డి– రజిత దంపతులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

దొండపాడు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీలో చేరిన వారిలో పి.చిన్న బచ్చయ్య, పి.కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, ఎం.సైదులు, ఎస్.కోటిరెడ్డి, పి.లింగప్రసాద్, బచ్చయ్య, నాగరాజు, మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, వీరాంజనేయరెడ్డి, తదితరులు ఉన్నారు.

## వాహనాలకు, ర్యాలీలకు అనుమతి లేదు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

హుజూర్‌నగర్ : ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో వాహనాలకు, ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఎన్నికల నియమావళి పాటించాలని చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద ఎన్నికల నియమావళి ప్రకారం పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి 100 మీటర్ల లోపు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థిని నిబంధనల ప్రకారం కార్యాలయంలోకి అనుమతిస్తారని చెప్పారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఏఆర్‌ఓ నాగార్జునరెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

కోదాడఅర్బన్ : హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ జర్నలిస్టుల ఫోరం జాతీయ అధ్యక్షుడు మాతంగి దాసు పిలుపునిచ్చారు. గురువారం కోదాడలోని ఎంఎస్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగూరి గోపి, రాష్ట్ర కార్యదర్శి పిడమర్తి గాంధీ, పడిశాల రఘు, రవీందర్, విశాఖ, రాకేష్, శేఖర్, సునీల్, నాగేందర్, అంజి, శివకృష్ణ, గోపి, బుచ్చిరాములు, ఉపేందర్, సందీప్, శ్యామ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**టీడీపీకి తొండపు సతీష్ రాజీనామా**

కోదాడరూరల్ : టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, కాపుగల్లు మాజీ సర్పంచ్ తొండపు సతీష్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు రోజుల్లో తన అనుచరులతో కలిసి ఎంపీ ఉత్తమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్‌పద్మావతిరెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోపూరి శిరీష, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఉన్నం హనుమంతరావు, ముత్తవరపు బాబురావు, పొంగులూరి రమేష్, కోటి, వేణు తదితరులు ఉన్నారు.

**కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు**

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ జీవధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనము, యాగశాలకు మామిడి తోరణాలు, పంచగవ్యప్రాసనము, దీక్షాధారణ, కంకణధారణ, కులదేవతారాధనతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజారులు రాయపోలు శ్రీరామశర్మ, రాయపోలు భద్రశర్మ, రాళ్లబండి రాజశేఖర్‌శర్మ, సర్పంచ్ కీత జ్యోతి రామారావు, కీత కోటయ్య కనకమ్మ కీత నాగేశ్వరరావు, సునీత పాల్గొన్నారు.

**అమరుల ఆశయాలను సాధించాలి**

గరిడేపల్లి : దోపిడిదారులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాలను సాధించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని మంగాపురంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి కోడి సైదులు పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామళ్ల నవీన్, ఉదయగిరి, వక్కవంతుల నరసింహారావు, కామళ్ల శ్రీను, గండు వెంకన్న, కోడి నాగరాజు, కోడి చిన్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి**

అనంతగిరి : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల సంఖ్యలో పేదలకు గృహాలు అందించిదని తెలిపారు. గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డిలు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో చేసిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్ పార్టీ చేసిందేమి లేదని పేర్కొన్నారు.

**కొనసాగుతున్న నిత్య అన్నదానం**



అన్నదానంలో పాల్గొన్న మాలధారులు

అనంతగిరి : మండల కేంద్రంలోని హరిహర అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు పదకొండవ రోజు గురువారం నిత్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు మాట్లాడుతూ ప్రతిరోజు సుమారు రెండువందలకు పైగా స్వాములకు నలభై ఎనిమిది రోజులపాటు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

హుజూర్‌నగర్‌రూరల్ : పశువులకు వేసే ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల మండల పశు వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్కవరంలో శుక్రవారం, శనివారం టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

## క్లుప్తంగా

### స్వర్ణ భారతి ట్రస్ట్ చేయూత



సైదులు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్వర్ణభారతి ట్రస్ట్ సభ్యులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని 32వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న పిడతల సైదులు కుటుంబానికి కోదాడ స్వర్ణ భారతి ట్రస్ట్ సభ్యులు గురువారం రూ.10,000ల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరావు, చెన్నకేశవరావు, సత్యబాబు, మధు, గుండెల సూరి, సైదులు, సుధాకర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌కేవీ మైనార్టీ సెల్ పట్టణ కన్వీనర్‌గా హుస్సేన్



ఎండీ హుస్సేన్

నేరేడుచర్ల : బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేరేడుచర్ల పట్టణ కన్వీనర్‌గా నేరేడుచర్లకు చెందిన ఎండీ హుస్సేన్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం నేరేడుచర్లలో బీఆర్‌ఎస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ ఎన్నికల ఇన్‌చార్జ్ మన్సూర్ అలీ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్సూర్ అలీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపు కోసం ముస్లింలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు వల్లంశెట్ల రమేష్‌బాబు, చిత్తలూరు సైదులు, అఫ్సర్, జానీ, సైదా, సైదులు, లతీఫ్, రియాజ్, ఖాసీం, ఖదీర్, ఖాదర్ ఉన్నారు.

### కేఆర్‌ఆర్ అధ్యాపకురాలు నిర్మలకు డాక్టరేట్



పట్టా అందుకుంటున్న నిర్మలకుమారి


కోదాడఅర్బన్ : పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ నందిగామ నిర్మలకుమారికి డాక్టరేట్ లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 83 స్నాతకోత్సవంలో అజోబ్ సీఈఓ శంతన్ నారాయణ్, వైస్ ఛాన్సలర్ ఆచార్య రవీంద్రయాదవ్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. కాగా నిర్మలకుమారి ప్రొఫెసర్ చెన్నప్ప పర్యవేక్షణలో 'ఖమ్మం జిల్లా ఆధునిక కవిత్వం ఒక పరిశీలన'అనే అంశంపై ఖమ్మం కేంద్రంగా విరాజిల్లిన వందేళ్ల సాహిత్యం, సాంస్కృతిక చరిత్రపై పరిశోధన జరిపినందుకు గాను ఆమెకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపక బృందం అభినందించారు.

### ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చిలకరాజు శ్రీను



నేరేడుచర్ల : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నేరేడుచర్లకు చెందిన చిలకరాజు శ్రీను నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏఐవైఎఫ్ ద్వితీయ రాష్ట్ర మహాసభలో చిలకరాజు శ్రీనును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



భిక్షం



నాగరాజు

గరిడేపల్లి : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ గరిడేపల్లి మండల నూతన కార్యవర్గాన్ని మండలంలోని తాళ్ల మల్కాపురంలో గురువారం జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా సత్తూరి భిక్షం, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, జిల్లా కౌన్సిలర్‌గా పాలూరి అంజయ్య, ఆర్థిక కార్యదర్శిగా బెక్కం రాంబాబుతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందం వెంకటేశ్వర్లు, ఓరుగంటి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాఘవులు, జానకిరెడ్డి, రామారావు, గోవిందయ్య, వీరస్వామి, రాంబాబు, లక్ష్మయ్య, రంగయ్య, భాగ్యరాణి, శ్రీలత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ అభ్యర్థి వాహనం తనిఖీ

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి వాహనాన్ని గురువారం రాత్రి నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఏమి దొరకకపోవడంతో పంపించేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.